

ఇన్‌చార్జ్ జిల్లా రిజిస్ట్రార్‌గా చెన్నకేశవరెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 19: కర్నూలు జిల్లా ఇన్‌చార్జి జిల్లా రిజిస్ట్రార్‌గా వి. చెన్నకేశవరెడ్డిని నియమిస్తూ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ శేషగిరిబాబు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత డీఆర్ సీహెచ్. నాగలింగేశ్వరరావు డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ నేపథ్యంలో ఆయన్ను అధికారులు ఘనంగా సత్కరించారు.



కనిపించని పొద్దుతిరుగుడు

● భారీగా తగ్గిన సాగు విస్తీర్ణం ● తగ్గిన దిగుబడులే కారణం

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 19: జిల్లాలో కొన్నేళ్ల క్రితం ఎటువైపు చూసినా పొద్దు తిరుగుడు పంట కనిపించేది. గ్రామాల్లో రైతులు ఎక్కువగా ఈ పంట సాగుపైనే దృష్టి సారించేవారు. సాగు ఖర్చు తక్కువ రావడం, దిగుబడి, లాభం అధికంగా ఉండడమే ఇందుకు కారణం. అయితే రానురాను విత్తన నాణ్యత తగ్గడంతోపాటు ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడంతో రైతులు ఈ పంట సాగును వదిలేశారు. దీంతో వేలాది ఎకరాల్లో సాగయ్యే పొద్దుతిరుగుడు పంట నేడు పదుల ఎకరాల్లో కూడా కనిపించడం లేదు.

సాగుకు పడిపోవడానికి కారణాలు ఇవే..

పొద్దు తిరుగుడు పంటకు ప్రధానంగా తెల్లదోమ, బట్‌నెక్రోసిస్ వైరస్ సోకడంతో పూత మొత్తం రాలిపోతుంది. ఈ వైరస్ ప్రభావంతో మొక్క కాండం కుళ్లుతూ, ఆకులు ఎండిపోతూ మొక్క చనిపోతుంది. అంతేగాకుండా రైతులు ఎంతో కష్టంతో పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర కూడా లభించడం లేదు. క్వింటం పొద్దు తిరుగుడుకు రూ.6,600 మద్దతు ధర లభిస్తేగాని రైతుకు గిట్టుబాటు కాదు. అయితే మార్కెట్‌లో మాత్రం ఈ పంటకు క్వింటానికి రూ.2 వేల నుంచి రూ.4వేలకు మించి ధర లభించడం లేదు. దీంతో రైతులు ఈ పంటను సాగు చేసేందుకు ఏ మాత్రం ముందుకు రావడం లేదు.



నాడు వేల ఎకరాల్లో సాగు..

కొన్నేళ్ల క్రితం జిల్లా వ్యాప్తంగా దాదాపు రెండు వేల హెక్టార్లకుపైగా పొద్దుతిరుగుడు పంటను రైతులు సాగు చేసేవారు. జిల్లాలో ఆలూరు, పత్తికొండ, కోడుమూరు, నందికొట్కూరు ప్రాంతాల్లో అధికంగా వేసేవారు. అయితే కొన్నేళ నుంచి ఆయా ప్రాంతాల్లో పొద్దుతిరుగుడు పంటను రైతులు సాగు చేయడమే మానేశారు. దీంతో ఎక్కడా పొద్దుతిరుగుడు పంట కనిపించకుండా పోయింది. రెండు వేల హెక్టార్లకుగాను ప్రస్తుతం 113 ఎకరాలకు మాత్రమే పరిమితమైంది. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 249 హెక్టార్లలో మాత్రమే పొద్దు తిరుగుడు పంటను సాగు చేశారు.





గిట్టుబాటు ధర లేదు

పొద్దు తిరుగుడు సాగుకు ఖర్చు తక్కువ. అయితే దిగుబడి పడిపోవడంతో పాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించడంలేదు. దీంతో పొద్దుతిరుగు సాగు చేయడం లేదు.

- రంగనాయకులు, కడివెళ్ల, ఎమ్మిగనూరు మండలం



బట్‌నెక్రోసిస్ వైరస్‌తోనే పంట సాగు తగ్గు ముఖం

పొద్దు తిరుగుడు పంటను గతంలో రైతులు విరివిగా సాగుచేసే వారు. అయితే ప్రస్తుతం రైతులు ఆ పంటను సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు. బట్‌నెక్రోసిస్ వైరస్‌తో పొద్దు తిరుగుడు పంట దిగుబడి తగ్గిపోయింది. ఈ వైరస్ ప్రభావంతో మొక్కలు చనిపోతుండడంతో రైతులు పంటను సాగు చేసేందుకు ముందుకు రావడం లేదు.

-మహ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

లక్ష్యం రూ.133 కోట్లు

● వసూళ్లు రూ.40.49 కోట్లు
● జిల్లాల వారిగా విజిలెన్స్ టీంల ఏర్పాటు
● బకాయిలు చెల్లించకుంటే లైసెన్స్‌ల నిలిపివేత
● కడప ఆర్‌జేడీ రామాంజనేయులు



ఎమ్మిగనూరు, సెప్టెంబరు 19: కడప రీజియన్ పరిధిలోని ఎనిమిది జిల్లాల్లో ఉన్న 74 వ్యవసాయ మార్కెట్ కమిటీల నుంచి ఈ ఏడాది రూ.133.16 కోట్ల సెస్సు వసూలు లక్ష్యంకాగా ఇప్పటి వరకు రూ.40.49 కోట్లు వసూలు చేసినట్లు కడప ఆర్‌జేడీ రామాంజనేయులు తెలిపారు. గురువారం ఆయన ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గతేడాది ఆగస్టు మాసాంతానికి రూ. 48.49 కోట్ల సెస్సు వసూలు చేసినట్లు తెలిపారు. అయితే ఈ ఏడాది కూడా పూర్తిస్థాయిలో సెస్సు వసూళ్లకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు గాను ఎనిమిది జిల్లాల్లో ఒక్కో జిల్లాలో రెండు విజిలెన్స్ టీంలను ఏర్పాటు చేసుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఈ విజిలెన్స్ టీంలు జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ చెక్‌పోస్టుల్లో జీరోలో సరుకు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా కట్టడి చేస్తాయని, తద్వారా మార్కెట్ సెస్సును పూర్తి స్థాయిలో వసూలు చేయవచ్చని అన్నారు. బకాయిలు చెల్లించకుండా మొండికేస్తే అటువంటి వారిని ఈనామ్‌లో హోల్డింగ్ పెడతామని అన్నారు. అలాగే పర్మిట్ బుక్కులను కూడా నిలిపివేస్తామని హెచ్చరించారు. కర్నూలు జిల్లాలోని ఏడు మార్కెట్లలో రూ.36.14 కోట్లు సెస్సు వసూలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు రూ.10.09 కోట్లు వసూలైందని తెలిపారు. అలాగే నంద్యాల జిల్లాలో ఉన్న ఎనిమిది మార్కెట్ల నుంచి రూ.20.05 కోట్ల సెస్సు వసూలు లక్ష్యంకాగా ఇప్పటి వరకు రూ.4.61కోట్లు వసూలైందని వెల్లడించారు. మిగతా మొత్తాన్ని కూడా రాబోయే మాసంలో వసూలు చేస్తామని చెప్పారు. ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్‌లో సీసీ కెమెరాలన్నీ పని చేయాలని సూచించామని అన్నారు. ఎవరైనా అధిక మొత్తంలో కమీషన్లు వసూలు చేసినట్లు తమ దృష్టికి వస్తే పరిశీలించి.. వారి లైసెన్స్‌ను హోల్డ్‌లో పెడతామన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ సెక్రటరీ పద్మావతి ఉన్నారు. అంతకుముందు కమీషన్ ఏజెంట్లు జేడీని కలిసి తమ సమస్యలు విన్నవించారు.

కర్నూలు-విజయవాడ కొత్త రైలును మంజూరు చేయండి

కేంద్ర మంత్రిని కలిసి మంత్రి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 19: కర్నూలు నుంచి విజయవాడ జంక్షన్ వరకు నూతన రైలును మంజూరు చేయాలని మంత్రి టీజీ భరత్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి వి. సోమన్నను కోరారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని టీజీ భరత్ కలిసి రైల్వే సమస్యలను విన్నవించారు. రాష్ట్ర రాజధాని అమరావతికి రైల్ నెట్ వర్క్ సహా అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తోందన్నారు. కర్నూలు నుంచి రాజధాని అమరావతికి ప్రత్యక్ష రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రం అభివృద్ధి చెందుతోందని వివరించారు. ఈ నేపథ్యంలో ముంబైతో కర్నూలు పారిశ్రామిక వేత్తల వ్యాపార కనెక్టివిటీని మెరుగు పరచడానికి కర్నూలు నుంచి ముంబైకి వారంలో ఒకటి లేదా రెండు సార్లు రైలు సౌకర్యం కల్పించాలన్నారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కర్నూలు టౌన్ నుంచి విజయవాడ జంక్షన్ వరకు రోజు వారీ రైలు సర్వీసును కల్పించాలని కోరారు



కేంద్ర మంత్రి సోమన్నతో టీజీ భరత్

పాలనలో చంద్రబాబుకు సాటిలేరు : తిక్కారెడ్డి



కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 19: ఇచ్చిన హామీలను నేరవేర్చడం, ఉత్తమ పాలన అందించడంలో చంద్రబాబు నాయుడుకు ఎవరూ సాటి లేరని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. గురువారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వంద రోజుల పాలన పూర్తి చేసుకుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో సామాజిక పింఛన్లు, డీఎస్సీ నోటిఫికేషన్, అన్న క్యాంటీన్లు, ఉచిత ఇసుక, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు లాంటి హామీలు వంద రోజుల్లో అమలు చేశామన్నారు. గతంలో జగన్‌రెడ్డి అధికార మదంతో ప్రజలను ముప్పుతిప్పలు పెట్టి, రాష్ట్ర సంపదను దోచేసుకున్నారని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్, పురందేశ్వరి కూటమి ప్రభుత్వంలో ఎలాంటి పొరపొచ్చాలు లేకుండా ఐక్యంగా ముందుకు వెళుతున్నారని కొనియాడారు.

శ్రీశైలానికి స్వల్పంగా ఇన్‌ఫ్లో

శ్రీశైలం, సెప్టెంబరు 19: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి గురువారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతోంది. సుకేసుల నుంచి 2,280 క్యూసెక్కులు మొత్తం 2280 వరద నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 879.30 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తి స్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 184.6012 టీఎంసీలుగా నమోద యింది. తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తిని నిలుపుదల చేశారు.



స్వర్ణాంధ్ర.. 2047 విజన్

● ప్రణాళికలతో ప్రతి శాఖ నివేదిక రూపొందించాలి
● 15 శాతం వృద్ధి రేటు సాధించాలి
● కలెక్టర్ పి. రంజిత్ బాషా




మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 19: స్వర్ణాంధ్ర. 2047 లక్ష్య సాధనలో భాగంగా జిల్లా, మండల స్థాయి ప్రణాళికలను రూపొందించాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో స్వర్ణాంధ్ర.2047 ప్రణాళికల రూపకల్పనపై జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 15 శాతం వృద్ధిరేటు సాధించేలా ప్రణాళికలు ఉండాలని అధికారులకు సూచించారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పరిశ్రమలు, మానవ వనరులు, వైద్య విధానం, సంక్షేమం మరింత అభివృద్ధి సాధించేలా ప్రణాళికలు ఉండాలన్నారు. టమోటా, ఉల్లి, ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, మార్కెటింగ్ అవకాశాలు పెంచడం, విద్యారంగంలో జీరో డ్రాపౌట్స్ రక్తహీనత తగ్గింపు, అక్షరాస్యత పెంపు తదితర అంశాలతో అభివృద్ధి ఎలా సాధించవచ్చు అని ఆలోచించి ప్రణాళికలను రూపొందించాలన్నారు. వంద రోజులు, వార్షిక, పంచవర్ష ప్రణాళికలను ప్రతి శాఖ రూపొందించాలని అన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, డీఆర్వో చిరంజీవి, సీపీవో హిమప్రభాకర్ రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పత్తికొండలో గంజాయి మత్తు

గుట్టు చప్పుడు కాకుండా విక్రయాలు ● చోద్యం చూస్తున్న అధికారులు



పత్తికొండ, సెప్టెంబరు 17 : ● పత్తికొండ పట్టణంలో నివసిస్తున్న ఆ వ్యక్తి బెల్దారి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ముగ్గురు ఆడపిల్లలకు ఎలాగో పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపాడు. చివరి కుమారుడు ఉన్నత చదువులు చదివి ఉద్యోగం చేస్తే తన కష్టం తీరుతుందని ఆశించాడు. ఇంటర్ వరకు బాగా చదువుతున్నాడనుకున్న కుమారుడు మత్తు మందుకు బానిసయ్యాడు. నిత్యం డబ్బు కోసం గొడవ పడుతుండడంతో కుటుంబం పరువు రోడ్డున పడింది. డబ్బు ఇవ్వకపోతే తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరింపులకు దిగే పరిస్థితికి వచ్చాడు. గంజాయి మత్తులో జీవితాన్ని నాశనం చేసుకుంటున్న కుమారుడు ఆ మత్తులో ఏమైపోతాడోనని తల్లిదండ్రులు నిత్యం మధనపడుతున్నారు.

● సైకిల్ పంక్చర్ షాప్‌తో కుటుంబాన్ని పోషించే వ్యక్తి కొడుకును స్థోమతకు మించిన పాఠశాలలో చేర్పించి చదివించాడు. అన్నింటా మంచి మార్కులతో ముందుకు సాగుతున్న కొడుకు మంచి ఉద్యోగం సంపాదిస్తే తమ కష్టాలు తీరుతాయని ఆశించాడు. చివరకు కొడుకు మత్తు మందుకు బానిసై ఆ తండ్రికి ఆశలన్నీ అడియాశలు చేశారు. కొడుకు వ్యసనాన్ని మాన్పించేందుకు ఎంతో ప్రయత్నించి విఫలమయ్యాడు. ఉన్నత స్థానానికి ఎదిగి కుటుంబాన్ని ఆదుకుంటాడని ఆశించిన కొడుకు కళ్ల ముందు మత్తులో జీవితాన్ని నాశనం చేసుకోవడం చూసి కుమిలిపోతున్నాడు.

ఇలా ఒకరు ఇద్దరు కాదు పత్తికొండ పట్టణంలో వందలమంది యువత గంజాయి మత్తుకు చిత్తవుతూ జీవితాలను నాశనం చేసుకుంటోంది. ఇంతటి ప్రమాదకర మత్తు మందు యథేచ్ఛగా పత్తికొండ పట్టణంలో కొన్ని దుకాణాల్లో నేరుగా విక్రయిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఏఏ దుకాణాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారం ఉన్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు దాడులు చేయడంకాని కేసులు నమోదు చేయడం కాని చేయకపోవడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు సాగుతున్న దందాపై తెలిసీ తెలియకుండా వ్యవహరిస్తున్న వారి తీరుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యాచకుల ముసుగులో సరఫరాదారులు

యాచకులుగా దుకాణాలకు వెళ్లే సాధువుల ముసుగులో దుకాణాలకు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది. పత్తికొండ ప్రాంతానికి గంజాయిని సరఫరా చేస్తున్న వ్యక్తులు వీరిని ట్రాన్స్‌పోర్టర్లుగా వినియోగించుకుంటూ ఎవరికి అనుమానం రాకుండా అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం. పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాలలో వీరు యాచకులుగా నటిస్తూ గంజాయి సరఫరాలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది.

వైసీపీ హయాంలో స్థానికనేత అండదండలతో..

గత వైసీపీ హయాంలో పాతపేట ప్రాంతంలో ఓ దుకాణదారుడు స్థానిక వైసీపీ నేత అండదండలతో యథేచ్ఛగా గంజాయి విక్రయాలు నిర్వహించాడు. ప్రస్తుతం ప్రభుత్వం మారినా సదరు దుకాణదారుడి వ్యాపారం మాత్రం ఆగలేదు. యథేచ్ఛగా గంజాయి విక్రయిస్తున్నా సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గంజాయి వ్యాపారం నిర్వహిస్తున్న దుకాణదారుల నుంచి నెల మామూళ్లు అందుతుండడంతో పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎంత పని చేశావన్నా..!

అప్పులు తీర్చలేక యువ రైతు బలవన్మరణం ● చనిపోయే ముందు సెల్ఫీ వీడియో



ఆత్మహత్యకు ముందు పురుగుల మందు డబ్బాతో రైతు నరసింహులు

అప్పులు కట్టలేక ఎంత పని చేశావు రైతన్నా.. కడసారైనా కట్టుకున్న భార్య, బిడ్డలు గుర్తు రాలేదా? పుట్టబోయే బిడ్డను చూడాలనిపించలేదా? బతికుంటే ఎలాగైనా అప్పులు తీర్చుకోవచ్చు అనుకోలేకపోయావా? ఇప్పుడు ఇంతమందిని బాధపెట్టి ఏం సాధించావు రైతన్నా..

ఆదోని, సెప్టెంబరు 19: ఆదోని మండలంలోని నాగలాపురం గ్రామానికి చెందిన యువ రైతు నరసింహులు(27) పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. నాగలాపురం గ్రామానికి చెందిన నరసింహులు తనకున్న ఎకరా పొలంతో పాటు మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి, వేరుశనగ సాగు చేశాడు. ఈ పంటల సాగు కోసం రూ.8 లక్షల మేర అప్పులు చేశాడు. వాతావరణ పరిస్థితుల కారణంగా పంటలు చేతికి అందలేదు. ఓ వైపు పంట నష్టం.. మరో వైపు రుణాతల ఒత్తిళ్లు అధికం కావడంతో నరసింహులు ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు. గురువారం పెద్దకడబూరు మండలం నెమలికల్లు దగ్గరలోని అటవీ ప్రాంతానికి వెళ్లి సెల్ఫీ వీడియో తీసుకుని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. వీడియో ఆధారంగా గుర్తించిన కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి వెళ్లారు. రైతు నరసింహులు భార్య స్వాతి తొమ్మిది నెలల గర్భిణీ. భర్త మృతదేహంపై ఆమె పడి విలపించిన తీరు కలచివేసింది. కాగా వీరికి ఇప్పటికే ఓ కుమార్తె సంతానం. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

గోడు వినవా.. రాఘవేంద్రా..!



పూలచింత పంప్‌హౌస్ స్టేజ్- 1

నందవరం, ఆగస్టు 19: గురురాఘవేంద్ర ప్రాజెక్టును నమ్ముకుని పంటలను సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ ప్రాజెక్టు కింద ఉన్న పూలచింత పంప్‌హౌస్‌లో పరికరాలు ధ్వంసం కావడం, మరికొన్ని చోరీకి గురి కావడంతో నీటి పంపింగ్ చేయలేని పరిస్థితి. సాగునీరందక ఆయకట్టు రైతులు సాగు చేసిన పంటలన్నీ ఎండిపోతున్నాయి. పాలకులు, అధికారులు ఏమాత్రం పట్టించుకోకపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పూలచింత రిజర్వాయర్ ఫేస్-1 కింద 4500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి అప్పట్లో శ్రీకారం చుట్టారు. గంగవరం దగ్గర ఉన్న పంప్‌హౌస్ నుంచి పూలచింత రిజర్వాయర్‌కు సాగునీరు పంపింగ్ చేసి అక్కడి నుంచి ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తారు. అయితే గతంలో పూలచింత ఫేస్-1లో ఒక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్, ఆయిల్‌ను గుర్తుతెలియని దుండుగులు దొంగలించారు. ఫేస్-1లో మరో ట్రాన్స్‌ఫార్మర్ పనిచేస్తుందని అందులో నుంచి పూలచింత రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేయాలని రైతులు కోరుతున్నారు. రెండు మోటర్లు వదిలితేనే రిజర్వాయర్ నింపేందుకు ఆవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఓ వైపు పంటలు ఎండిపోతున్నాయని ప్రస్తుతం ఒక్క మోటర్ నుంచి అయినా రిజర్వాయర్‌కు నీటిని వదిలిపెడితే పంటను కాపాడుకుంటామని రైతులు కోరుతున్నారు. పూలచింత రిజర్వాయర్‌ను నమ్ముకుని 4,500 ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేసిన రైతులకు సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. ఇటీవల ఈ పథకం కింద ఆయకట్టు రైతులకు సాగునీరందించాలని పంప్‌హౌస్ దగ్గర రైతులు ధర్నా చేశారు. అయినప్పటికీ అధికారుల్లో ఎలాంటి చలనం రావడం లేదు.



నీళ్ల లేక ఇంకిపోయిన రిజర్వాయర్

- పూలచింత పంప్‌హౌస్‌లో పరికరాలు చోరీ
- దిగువకు విడుదల కాని సాగు నీరు
- ఎండిపోతున్న పంటలు.. రైతుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు

రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపాం

పూలచింత రిజర్వాయర్ పనుల కోసం రూ.4 కోట్లతో ప్రతిపాదనలు పంపాం. ప్రస్తుతం పూలచింత పేస్-1లో 1,550 లీటర్ల ఆయిల్ దొంగతనం జరిగింది. అయితే మరో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం రూ.10 లక్షలు ఎస్టిమెంట్ వేసి పంపాం. నిధులు వస్తే వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ప్రతి రైతుకు సాగునీరందిస్తాం. - శ్యాంబాబు, ఏఈ, జీఆర్‌పీ



అయిల్ చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

పంట పోతోంది



రెండెకరాల్లో పత్తి, మరో రెండు ఎకరాల్లో మిరపను సాగు చేశా. అయితే ఇంత వరకు సాగునీరు మాత్రం రాలేదు. దీంతో పంటలు ఎండుదశకు చేరుకున్నాయి. అధికారులు సాగునీరు వదలకపోతే పెట్టుబడులు కూడా పోతాయి.
-లక్ష్మన్న, రైతు

అధికారులు పట్టించుకోవడం లేదు



మోటర్లు కాలిపోయిన, ఆయిల్, కాపర్ దొంగతనం జరిగిన అధికారులు పట్టించుకోరు. కనీసం ఒక్క వాచ్‌మెన్‌ను కూడా ఏర్పాటు చేయలేదు. ఒక మోటర్ నుంచి నీటిని వదిలినా కూడా పంటలు బతుకుతాయి. నేను 5 ఎకరాల్లో పత్తి, రెండు ఎకరాల్లో మిరప సాగు చేశాను. రూ.లక్షకు పైగా ఖర్చు పెట్టా. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు.
-గోపాల్, రైతు

ఆటో బోల్తా.. ఒకరి మృతి

పత్తికొండ, సెప్టెంబరు 19 : వ్యవసాయ పనులకు కూలీలు వెళ్తున్న ఆటో బోల్తాపడడంతో అందులో ప్రయాణిస్తున్న వారిలో ఒకరు మృతి చెందగా మిగిలిన వారు గాయాలపాలయ్యారు. పత్తికొండ పట్టణం 11వవార్డులో నివసిస్తున్న మహిళా కూలీలు గురువారం ఉదయం పత్తికొండ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో పత్తిచేలో పనులు చేసేందుకు ఆటోలో బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటోకు కొత్తపల్లి రహదారిలో బ్రిడ్జి సమీపంలో మోటార్‌సైకిల్ అడ్డురావడంతో అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లక్ష్మీదేవి (60) అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వారిని 108 అంబులెన్స్‌లో పత్తికొండ ఆసుపత్రికి తరలించారు. అందులో నలుగురు మహిళలకు తీవ్రగాయాలు కావడంతో వారిని కర్నూలుకు తరలించారు. ఆటోడ్రైవర్‌తోపాటు మిగిలిన వారికి చికిత్సలు అందించి ఇంటికి పంపారు. పోలీసులు కేసు దర్యాప్తుచేస్తున్నారు.

వ్యక్తి గల్లంతు

హాలహర్వి, సెప్టెంబరు 19 : బాపురం వద్ద దాహం కోసం వెళ్లి సోమశేఖర్ (38)అనే వ్యక్తి ఎల్లెల్సీలో గల్లంతయ్యాడు. గురువారం పొలంలో పనిచేసి దాహం తీర్చుకోడానికి వెళ్లి కాలుజారి కాల్వలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. శవం కోసం బంధువులు కాల్వలో ప్రయత్నంచినా దొరకలేదు.

జంట హత్యల కేసు కొట్టివేత

కర్నూలు(లీగల్), సెప్టెంబరు 19: స్థానిక గిప్సన్ కాలనీలో జరిగిన జంట హత్యల కేసును కొట్టివేస్తూ కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధీ గురువారం తీర్పు చెప్పారు. కర్నూలు నగరం గిప్సన్ కాలనీలోని తేజ డీలక్స్ అపార్టుమెంటులో ఉంటున్న పి.మధుసూదన్ రెడ్డి, పి.రమాదేవిలను నిందితులు వెంకటప్రసాద్, రోహిత్ కుమార్, నవీన్ కుమార్, సీతన్నలు 2013 డిసెంబరు 29న హత్య చేశారు. అనంతరం వారి వద్ద ఉన్న డబ్బు, నగలను దోచుకెళ్లారు. పి.మధుసూదన్ రెడ్డి తమ్ముడు పి.ధనుంజయరెడ్డి ఫిర్యాదు మేరకు కర్నూలు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణ సమయంలో రెండో నిందితుడు రోహిత్ కుమార్ మృతి చెందగా మిగతా ముగ్గురు నిందితులపై విచారణ జరిగింది. అయితే కోర్టులో నేరం రుజువు కాకపోవడంతో నిందితులపై కేసును కొట్టివేస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. నిందితుల తరపున సీనియర్ న్యాయవాది బి.మురళి మనోహర్ వాదించారు.

కారు ఢీకొని చిన్నారి మృతి

బనగానపల్లె, సెప్టెంబరు 19: కారు ఢీకొని గురువారం ఓ చిన్నారి మృతి చెంది. బనగానపల్లె పట్టణం కొండపేటలోని పింజరిపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మహమ్మద్‌ఆలీ, రెహనా దంపతుల కుమారుడు మూడేళ్ల చిన్నారి అబుకర్ సిద్దిక్ బంధువుల ఇంటికి వెళ్తుండగా కారు ఢీకొంది. కారు తలపై పోవడంతో చిన్నారి అబుకర్ సిద్దిక్ అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. బాలుడి మృతదేహాన్ని బనగానపల్లె వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. బాలుడు తండ్రి మహమ్మద్ ఆలీ ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

బనగానపల్లె, సెప్టెంబరు 19: బనగానపల్లె మండలం నందివర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని నందవరం గ్రామానికి చెందిన కొమ్ము రమేశ్ (28)అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. రమేశ్‌కు గ్రామంలో రూ.8.50 లక్షల అప్పులయ్యాయి. అవి తీర్చే మార్గం లేక మనస్థాపానికి గురయ్యాడు. మూడు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధువులు వెదికినా ఆయన ఆచూకీ దొరకలేదు. గురువారం ఉదయం నందవరం ఊరిబయట పొలాల్లో మునగ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య చౌడేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నందివర్గం ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

ఉరివేసుకొని..

బనగానపల్లె, సెప్టెంబరు 19: బనగానపల్లె పట్టణంలోని పంచమపేటకు చెందిన దారా పెద్ద ఓబులేసు(40) గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మద్యానికి బానిసైన ఓబులేసు వేధింపులు భరించలేక భార్య ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలోనే ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య రంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణయ్య తెలిపారు.

మార్కెట్ కమిటీ సెక్రటరీగా జయలక్ష్మి



కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 19: కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా జయలక్ష్మిని నియమిస్తూ మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న గోవిందును అనంతపురం మార్కెట్ కమిటీ సెక్రటరీగా బదిలీ చేశారు. డైరెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ సెక్రటరీల బదిలీలు డిప్యుటేషన్‌పై మాత్రమే కొనసాగాలని ఏడాది పాటు ఈ ఉత్తర్వులు అమవుతాయని పేర్కొన్నారు

ముగ్గురు వీఏవోల తొలగింపు

నిధుల గోల్‌మాల్‌పై విచారణకు ఆదేశాలు

పత్తికొండ, సెప్టెంబరు 19 : పొదుపు సంఘాలకు అనుసంధానంగా పని చేసే గ్రామైక్య సంఘాల ముగ్గురు వీఏవోలను జిల్లా అధికారులు తొలగించినట్లు ఏపీఎం మధుబాబుగౌడ్ తెలిపారు. పత్తికొండ పట్టణంలో ఒకే కుటుంబానికి చెందిన భార్యా భర్తలు, వారి కుమారుడు నిబంధనలకు విరుద్ధంగా వీఏవోలుగా కొనసాగుతున్నారు. పొదుపు సంఘాలకు రుణాలను ఇప్పిండంలో వీరు అవినీతికి పాల్పడుతున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో విచారణకు రావాలంటూ జిల్లా పీడీ ఆదేశాలు జారీ చేశారు. ఐదు నెలలు గడచినా ఈ ముగ్గురు వీఏవోలు విచారణకు హాజరుకాకపోవడంతో వారిని విధుల నుంచి తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. కాగా గ్రామైక్య సంఘాల పరిధిలో ఉండాల్సి సీఐఎఫ్ నిధులు రూ 25 లక్షలు వీరి హయాంలో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై త్వరలో జిల్లా అధికారులు పత్తికొండలో విచారణకు రానున్నట్లు సమాచారం.

మడతపడిన పేగుకు ల్యాప్రోస్కోపిక్ సర్జరీ



రోగితో సర్జరీ యూనిట్-2 చీఫ్ రామకృష్ణ నాయక్, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 19: కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో రోగికి కోత లేకుండా ల్యాప్రోస్కోపిక్ సర్జరీ విజయవంతంగా నిర్వహించారు. హాలహర్వికి చెందిన 70 ఏళ్ల సావిత్రమ్మ కడుపు నొప్పి, లవణాలు తక్కువ రావడం వంటి సమస్యలతో కర్నూలు జీజీహెచ్ మెడిసిన్ విభాగానికి వచ్చారు. అక్కడి నుంచి గత నెల 28వ తేదీ జనరల్ సర్జరీ యూనిట్-2కు వైద్యులు రెఫర్ చేశారు. అక్కడ ఆ యూనిట్ చీఫ్ డా.రామకృష్ణ నాయక్ రోగికి సీటీ, అల్ట్రాసౌండ్ పరీక్షలు నిర్వహించారు. కడుపులో పేగు మడతపడి, చెడిపోయినట్లు గుర్తించారు. సాధారణంగా ఇలాంటి కేసును ఓపెన్ సర్జరీ ద్వారా నిర్వహిస్తుంటారు. కానీ రోగి వృద్ధురాలు కావడంతో ఆరోగ్యశ్రీ కింద ఈ నెల 4వ తేదీన ల్యాప్రో స్కోపిక్ సర్జరీని విజయవంతంగా నిర్వహించారు. యూనిట్ చీఫ్ డా.రామకృష్ణ నాయక్, అసోసియేట్ ప్రొఫెసర్ డా.సాబీరా అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.చైతన్యవాణి, డా.మన్సూర్‌బాషా, డా.ప్రణీత, అనస్థీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డా.సోమశేఖర్ నేతృత్వంలో రోగి కడుపులో ప్రేగు మెలిక పడిన ప్రేగు చెడిపోయిన బాగాన్ని ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో నిర్వహించారు. ఇలాంటి సర్జరీ కర్నూలు జీజీహెచ్‌లో మొట్టమొదటి సర్జరీ అని పేర్కొన్నారు.

నేటీ నుంచి పీజీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 19: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 20 నుంచి 29 వరకు పీజీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ వెంకటేశ్వర్లు తెలిపారు. పరీక్షల కోసం 55 మంది దరఖాస్తు చేసుకున్నారని, పరీక్షలకు సంబంధించి ఆన్‌లైన్‌లో హాలు టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

1 నుంచి క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 19: కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో 1 నుంచి క్యాన్సర్ పరీక్షల ప్రోగ్రాం ప్రారంభిస్తున్నట్లు కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసుపత్రి వైద్యులు ఇటీవల విశాఖపట్నంలో హెచ్‌బీసీహెచ్ అండ్ ఆర్‌సీలో అంకాలజిలో శిక్షణ తీసుకున్నట్లు పేర్కొన్నారు. కర్నూలు స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో గురువారాల్లో రోగులకు స్క్రీనింగ్ టెస్టు నిర్వహించాలని వైద్యులను ఆదేశించామని చెప్పారు. ఇందు కోసం ప్రివెంటివ్ అంకాలజీ క్యాన్సర్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

మామ దాడి చేశాడని కోడలు ఆత్మహత్య

సంజామల, సెప్టెంబరు 19: మామ దాడి చేశాడని కోడలు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వసంతాపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గుంతమల్ల ఉమాదేవి (35)పై మామ గుంతమల్ల శిఖామణి ఈ నెల 14న దుర్భాషలాడుతూ కాళ్లు, చేతులతో తన్నాడు. మనస్తాపానికి గురైన కోడలు ఉమాదేవి పురుగుల మందు తాగింది. విషయం తెలుసుకున్న బంధువులు కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త నంద్యాల రైల్వేలో ట్రాక్‌మన్‌గా పని చేస్తూ వసంతాపురంలో కాపురం పెట్టి వారానికోసారి వచ్చి పోయే వాడు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. మృతురాలి తండ్రి పడిగల నాగేశన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమణయ్య తెలిపారు.

సీఎంఎఫ్‌ఎస్‌లోకి అక్రమ చొరబాటు



- కాంకరెన్స్ లేదంటూ తిరస్కరణ
- ఆర్‌యూ తీరుపై ఆడిట్ అధికారుల అసహనం

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 19: రాయలసీమ యూనివర్సిటీలో సీఎంఎఫ్‌ఎస్‌లోకి అక్రమంగా చొరబాట్లపై విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. విద్యా ప్రమాణాలు మెరుగుపరచాల్సిన వర్సిటీలో పాలనకు తూట్లు పొడిచే తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. యూనివర్సిటీలో ప్రస్తుతం నాన్ టీచింగ్ ఉద్యోగులు 24 మంది ఉన్నారు. వీరికి ఎనిమిది నెలలుగా సీఎంఎఫ్‌ఎస్ ద్వారా ప్రభుత్వం జీతాలు చెల్లించాల్సి ఉంది. కానీ 24 మంది ఉద్యోగుల ఫైల్స్‌కు అప్రూవల్ లేదని, వీరికి సీఎంఎఫ్‌ఎస్ ద్వారా జీత, భత్యాలు చెల్లించడం కుదరదని ఫైనాన్స్, ఆడిట్ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గత 8 నెలలుగా వర్సిటీ ఇంటర్నల్ నిధుల నుంచి జీతాలను చెల్లిస్తున్నారు. నిబంధనల ప్రకారం వర్సిటీలో పని చేసే రెగ్యులర్ నాన్ టీచింగ్‌లోని 24 మంది ఉద్యోగులకు సీఎంఎఫ్‌ఎస్ ద్వారానే వేతనాలు ఇవ్వాలి. అలా కాకుండా వర్సిటీ నిధుల నుంచి వేతనాలు ఇవ్వడాన్ని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి. కొత్తగా బాధ్యతలు తీసుకున్న ఉన్నతాధికారితోపాటు మరో ఇద్దరిని సీఎంఎఫ్‌ఎస్ డేటాలోకి ఎక్కించుకోవడంపై ఫిర్యాదులు వెళ్లాయి. స్పందించిన సీఎంఎఫ్‌ఎస్ అధికారులు తిరస్కరించడం వర్సిటీలో హట్ టాపిగా మారింది. ఈ ముగ్గురికి సీఎంఎఫ్‌ఎస్‌లో ఎక్కించుకునేందుకు కాంకరెన్స్ (ఫైనాన్స్ అనుమతి) లేకుండా ఎలా పేర్లు అప్‌లోడ్ చేస్తారంటూ వివరణ కోరడం ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది.

56 జీవో ప్రకారం సీఎంఎఫ్‌ఎస్‌లోకి

56 జీవో ప్రకారం సీఎంఎఫ్‌ఎస్ డేటాలోకి పేర్లు ఎక్కించిన మాట వాస్తవ మే. కానీ ఉద్యోగులకు సంబంధించి సీనియార్టీ పాటించలేదన్న ఆరోపణలను పట్టించుకోనవసం లేదు. అంతా కరెక్టుగానే ప్రక్రియను చేపడుతున్నాం.
- వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్, రాయలసీమ యూనివర్సిటీ

సీఎంఎఫ్‌ఎస్ డేటా చొరబాటులో ఆందోళన చేపడతాం

సీఎంఎఫ్‌ఎస్ డేటాలోకి అక్రమంగా చొరబడి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేయడం మంచి సంప్రదాయం కాదు. అవసరమైతే వర్సిటీలో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం. డేటాలోకి ఎక్కించిన ఉద్యోగులకు ఫైనాన్స్ అప్రూవల్ లేని వారిని జాబితా నుంచి వెంటనే పేర్లను తొలగించాలి.
- సోమన్న, జిల్లా అధ్యక్షుడు, ఏఐఎస్ఎఫ్

ఐదు కేంద్రాల ద్వారా ఇసుక సరఫరా



కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 19: జిల్లాలో ఐదు డిసిల్టింగ్ కేంద్రాల ద్వారా ఇసుక సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. అమరావతి నుంచి ఏపీ శాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్ ప్రారంభం సందర్భంగా కలెక్టర్లతో సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసిల్టింగ్ పాయింట్ల ద్వారా ప్రతి రోజు 7,500 మెట్రిక్ టన్నుల ఇసుకను ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా రవాణా చేయడానికి వీలుగా తగిన ఏర్పాట్లు చేశామన్నారు. ప్రస్తుతం కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాలకు కలిపి రోజూ 5 వేల మెట్రిక్ టన్నుల ఇసుక వరకు డిమాండ్ ఉందని, డిమాండ్‌కు తగ్గట్లుగా ఇసుకను సరఫరా చేస్తున్నామన్నారు. అమ్మకపు ధరపై జీఎస్టీ తగ్గిన కారణంగా జిల్లాలో ఇసుక ధర రూ.326ల నుంచి రూ.320లకు తగ్గించామన్నారు. ఇసుక రీచుల వద్ద 1.5 కి.మీల నుంచి 2.కిమీ వరకు చూడగలిగే వీఆర్ కెమెరాలు ఏర్పాలు చేయగలిగితే మొత్తం ప్రక్రియను చూసే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కోరారు. సీఎం సానుకూలంగా స్పందిస్తూ అలాంటి కెమెరాలు అందజేస్తామని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, మైనింగ్ డీడీ రాజశేఖర్, డీటీసీ శ్రీధర్, డీపీవో నాగరాజు నాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు, సీ.బెళగల్ తహ సీల్దార్ విజయశ్రీ, సీపీవో హిమప్రభాకర్ రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రజా వేదికలు : రాష్ట్ర ప్రభుత్వం వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సాధించిన విజయాలపై గురువారం నుంచి 26వ తేదీ వరకు ప్రజావేదికలు (గ్రామ సభలు) నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. గురువారం జిల్లా, మున్సిపల్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సెప్టెంబరు 20 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే ప్రజావేదికల నిర్వహణకు సంబంధించిన షెడ్యూల్‌ను రూపొందించాలని జడ్పీ సీఈవోను, డీఎల్‌డీవోను ఆదేశించారు. సచివాలయ సిబ్బందిని హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసే ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు.

సీఎం చంద్రబాబుకు చెక్కు అందజేత



సీఎంకు చెక్కును అందజేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, సెప్టెంబరు 19: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పాణ్యం నియోజకవర్గంలో సేకరించిన నగదును ఎమ్మెల్యే గౌరు చరిత సీఎం నారా చంద్రబాబునాయుడుకు అందజేశారు. గురువారం విజయవాడలోని సెక్రటేరియట్‌లో సీఎంను కలిసిన రూ.33.50 లక్షల చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే గౌరు చరితను సీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, రాయపు యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోండి

కర్నూలు(రూరల్)సెప్టెంబరు 19: కర్నూలు నగరశివారు ప్రాంతాల్లో చెరువులు, అలుగు వంకలు, ప్రభుత్వ భూములు ఆక్రమించిన కబ్జాదారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు పుల్లారెడ్డి, శ్రీనివాసరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం నగరశివారులో కబ్జాకు గురైన స్థలాలను పరిశీలించారు. వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు అనేక ప్రభుత్వ భూములను అక్రమించారని ఆరోపించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులతో చేయికలిపిన వైసీపీ నాయకులు, వారికి తోడుగా రెవెన్యూ అధికారులతో విచ్చలవిడిగా ప్రభుత్వ భూములు, చెరువులు, వంకలు ధారాదత్తం చేశారన్నారు.

రైతులకు పరిహారం పంపిణీ



నష్ట పరిహారం చెక్కులు అందజేస్తున్న గౌరు వెంకటరెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 19: ఏఎం గ్రీన్‌ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సోలార్ ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి నష్ట పరిహారం అందజేశారు. గురువారం కంపెనీ ప్రతినిధులతో కలిసి ఆయన తన స్వగృహంలో పాణ్యం మండలం కందికాయపల్లెకు చెందిన దాదాపు వంద మంది రైతులకు ఎకరానికి రూ.5 లక్షల చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. అదేవిధంగా పాణ్యం మండలం పిన్నాపురం గ్రీన్‌కో ప్రాజెక్టు నిర్మాణ పనుల వల్ల ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు నష్ట పరిహారాన్ని గౌరు వెంకటరెడ్డి పంపిణీ చేశారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు రూ.50 వేల చొప్పున 400 మందికి పరిహారం అందజేశారు.

రేపు సబ్ జూనియర్స్ ఆట్యాపాట్యా ఎంపిక పోటీలు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 19: స్థానిక డీఎస్‌ఏ ఔట్‌డోర్ స్టేడియంలో ఉమ్మడి జిల్లాల సబ్ జూనియర్స్ బాల బాలికలకు ఈ నెల 21న ఉదయం 10 గంటలకు ఆట్యాపాట్యా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆట్యా పాట్యా సంఘం కార్యదర్శి బాల పవన్ గురువారం తెలిపారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్‌కార్డు జిరాక్స్‌తోపాటు రూ.50 ప్రవేశ రుసుం చెల్లించి నేరుగా పోటీల్లో పాల్గొనాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు వచ్చే అక్టోబరు 5, 6 తేదీల్లో నెల్లూరులో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. వివరాలకు 9393855460, 9032104158 నెంబర్లను సంప్రదించాలన్నారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 19: సెట్కూరు ఆధ్వర్యంలో యువ కళాకారులకు సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఈనెల 26న జరగనున్న సాంస్కృతిక పోటీల పోస్టర్‌ను కలెక్టర్ పి.రంజిత్ బాషా గురువారం ఆవిష్కరించారు. 15 నుంచి 29 సంవత్సరాలలోపు యువతకు జానపద నృత్యాలు, సైన్స్ టెక్నాలజీ, హ్యాండీక్రాఫ్ట్ తదితర అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు సెట్కూరు సీఈవో దీప్తి తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 9121415234ను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన సచివాలయ ఉద్యోగుల కౌన్సెలింగ్



కార్యదర్శులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 19: నగర పాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు గురువారం బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహించారు. గురువారం నూతన కౌన్సిల్ హాలులో అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శులకు రెవెన్యూ అధికారి జునైద్, వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శులకు మేనేజర్ చిన్నరాముడు, వెల్ఫేర్ కార్యదర్శులకు టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, శానిటేషన్ కార్యదర్శులకు మెడికల్ హెల్త్ ఆఫీసర్ కే.విశ్వేశ్వ రరెడ్డి, అమ్యూనిటీస్ కార్యదర్శులకు డీఈ క్రిష్ణలత, ప్లానింగ్ కార్యదర్శు లకు డీసీపి సంధ్యారాణి కౌన్సెలింగ్ నిర్వహించారు. మ్యూచువల్, స్పౌస్‌కు సంబంధించిన వాటికి ప్రాధాన్యమిచ్చారు.

మహిళల భద్రతపై అవగాహన సదస్సు

కర్నూలు, సెప్టెంబరు 19: పాతబస్తీలోని ఉస్మానియా కళాశాలలో మహిళ భద్రతపై అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సదస్సుకు వన్‌టౌన్ సీఐ రామయ్యానాయుడు హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రోజురోజుకూ మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని అన్నారు. మహిళలకు ఏదైనా సమస్యలు వస్తే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. ఈవ్ టీజింగ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోల వివరాలు పెంచుకోవడంలో జాగ్రత్త వహించాలని, అలాగే సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ సమ్రుద్దీన్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, లీగల్ సర్వీస్ అడ్వకేట్ సులోచన, వన్‌స్టాప్ సెంటర్, సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో అద్భుత పాలన: సోమిశెట్టి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 19: చంద్రబాబు వంద రోజుల పాలనలో అసాధ్యాలను సుసాధ్యం చేసి అద్భుతమైన పనికి నిదర్శనం చూపించారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం సాయంత్రం తిరుపతి పర్యటన ముగించుకుని జిల్లా తెలుగుదేశం పార్టీ చేరుకుని విలేకరుల సమావేశం నిర్వహించారు. గత జగన్మోహన్‌రెడ్డి హయంలో రాష్ట్ర ఉద్యోగులకు కనీసం జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ఉండిందని, ప్రతి నెల అప్పులు చేసి దివాలా తీయించిన రాష్ట్రాన్ని చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత తన కున్న పాలనా అనుభవంతో గాడిలో పెట్టారని కొనియాడారు.

విజయానికి బాటలు వేసుకోవాలి



పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 19: విద్యార్థులు ఆటల పోటీలలో గెలుపు ఓటములకు నిరుత్సాహపడకుండా విజయానికి కృషి చేయాలని ఎంఈవో వినోద్ కుమార్ అన్నారు. గురువారం డీఎస్ఏ ఔట్‌డోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ అండర్-14బాలబాలికల ఎంపిక పోటీల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈవోతో పాటు డీఎస్‌డీవో భూపతిరావు, న్యాయవాది శ్రీధర్ రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ పోటీలను మండల కోఆర్డినేటర్ పుల్లన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ విజయకుమార్, కొండేపోగు చిన్న సుంకన్న, సుబ్రహ్మణ్యం, నాగరాజు, చాణక్యదాసు, రాజశేఖర్, సురేష్, మల్లికార్జున, గంగాధర్, శారద, ఉమ, సరళ, విద్యార్థులు పాల్గొన్నారు.

46వ వార్డులో నేడు బీజేపీ సభ్యత్వ నమోదు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 19: నగరంలోని 46వ వార్డు అశోక్‌నగర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగరూరు రాఘవేంద్ర ఒక ప్రకటనలో తెలి పారు. ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్, ఎస్సీ ఉప కులాల వారు హాజరు కావాలని ఆయన కోరారు. బీజేపీ కేంద్రం లో అధికారంలోకి వచ్చాక ప్రజల జీవన విధానం మారిందని, గతంలో ఎన్నడూ లేనివిధంగా దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ ఉచిత బియ్యంతోపాటు వివిధ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. బీజే పీని బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని కోరారు.

రుచికరమైన భోజనం అందించాలి



భోజనం రుచి చూస్తున్న ఎంఈవో-2 ఓంకార్ యాదవ్

ఓర్వకల్లు, సెప్టెంబరు 19: విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని ఎంఈవో ఓంకార్ యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని కాల్వబుగ్గ ఏపీఆర్ గురుకుల పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు వంటపై శిక్షణ ఇచ్చారు. చింతపండు పులిహోర, సాంబార్ బాత్ తయారు చేసే విధానంపై ప్రిన్సిపాల్ ప్రసాదరావు ఆధ్వర్యంలో వంట మాస్టార్లతో మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మూడో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సుల సంఘానికి ఎన్నికలు జరపండి



అత్యవసర సమావేశంలో పాల్గొన్న హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 19: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్‌కు తక్షణమే ఎన్నికలు జరిపించాలని కర్నూలు జీజీహెచ్‌కు చెందిన సీనియర్ హెడ్ నర్సులు, రెగ్యులర్ స్టాఫ్ నర్సులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం 2 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలో ఎగ్జామ్ హాల్‌లో హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులు అత్యవసర సమావేశం నిర్వహిం చా రు. తమకు గ్రూపులు, సంఘాలతో సంబంధం లేదని, అసోసియేషన్ నిష్పక్షపాతంగా పకడ్బందీగా ఎన్నికలు జరిపించాలని కోరారు. ఆరేళ్ల నుంచి సంఘానికి ఎన్నికలు లేకపోవడంతో ఏళ్లతరబడి నర్సులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అసోసియేషన్‌కు ఎన్నికలు లేకపోవడంతో గత 13 ఏళ్లుగా కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు రెగ్యులర్ చేయాలని ఆందోళన చేస్తున్నారని, అదే సంఘం ఉన్నట్లయితే ఈ సమస్య పరిష్కారమయ్యేదన్నారు.

పెండింగ్ జీతాల కోసం రోడ్డెక్కిన సెక్యూరిటీ గార్డులు



ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 19: పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలు చెల్లించాలని కోరుతూ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన సెక్యూరిటీ గార్డులు రోడ్డెక్కారు. గురువారం ఉదయం 6 గంటలకు విధులు బహిష్కరించి ఆసుపత్రి ఆవరణలో ఆందోళన చేశారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట సెక్యూరిటీ గార్డులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం నుంచి రావాల్సిన జీతాలు కూడా ఇవ్వలేదన్నారు. సెక్యూరిటీ ఏజెన్సీ ఎండీని జీతాలు అడిగితే ప్రభుత్వం నుంచి ఆరు నెలల బిల్లులు రావాల్సి ఉన్నాయన్నారు. అనంతరం కలెక్టర్‌ను ప్రజా వేదికలో వినతి పత్రం సమర్పించారు.

పారిశుధ్య పనుల పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 19: నగరంలోని ఎన్‌ఆర్‌పేట, కొత్తపేట, బంగారుపేట, సంకల్‌బాగ్, కల్లూరు తదితర ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు గురువారం పరిశీలించారు. పరిమళ నగర్, సెట్కూరు కార్యాల యం వద్ద నూతనంగా నిర్మించిన అన్న క్యాంటీన్లను పరిశీలించారు. అనంతరం కార్యాల యంలో అకౌంట్స్ విభాగం అధికారులు, ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అకౌంట్స్ ఆఫీసర్ చుండీప్రసాద్, ఎగ్జామినర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

● జాయింట్ కలెక్టర్ బి.నవ్యను కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అంజదేశారు.

● నగర మేయర్ బీవై.రామయ్యను కమిషనర్ ఎస్.రవీంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం కమిషనర్‌కు డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు, జుబేర్, యూనుస్, క్రాంతి కుమార్, కృష్ణకాంత్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సాంబశివరావు, ఎస్‌టి.షేక్ అహ్మద్‌లు శుభాకాంక్షలు తెలిపారు.

'కేవీ సుబ్బారెడ్డి'లో క్యాంపస్ ఎంపికలు



క్యాంపస్ సెలక్షన్స్‌కు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 19: నగర శివారు దూపాడులోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. బెంగళూరుకు చెందిన పోడెయిన్ ఇన్ఫినిష్ ఇన్నోవేషన్ సంస్థ, చెన్నైకి చెందిన స్కానిడేర్ ఎలక్ట్రానిక్ సంస్థల ప్లేస్‌మెంట్ అధికారులు సయ్యద్ యాసిన్, వంశీక్రిష్ణ ఈ ప్రాంగణ ఎంపికలు చేపట్టి 116 మంది విద్యార్థుల్లో 62 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ విజయకుమార్, టెక్నికల్ ప్రోగ్రాం అధికారి ఎస్ సుమయా తబస్సుమ, వివిధ విభాగాల అధిపతులు, ఫ్యాకల్టీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణించాలి'

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 19: క్రీడాకారులు అన్ని రంగాల్లో రాణించాలని న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, జిల్లా ఒలంపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులు అన్నారు. పట్టణంలోని విఠల్‌నగర్‌లోని గుడ్‌షప్పర్డ్ పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ షూటింగ్ బాల్ ఎంపిక పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మిన్నెల్ల, షూటింగ్ బాల్ ప్రధాన కార్యదర్శి పరుశురా ముడు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ హర్షవర్ధన్, జిల్లా ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు చిన్న సుంకన్న, జిల్లాకార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు సుభాన్ బాషా, కోచ్ మల్లికార్జున, యోగా సంఘం కార్యదర్శి ప్రభాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19: లక్ష్మీపురం సమీపంలో ఉన్న రిడ్జ్ పాఠశాల విద్యార్థులు తమిళనాడు కార్తైకుడిలో సెప్టెంబరు 10 నుంచి 13 వరకు జరిగిన తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో రిడ్జ్ పాఠశాల విద్యార్థులు ఆరు పతకాలను సాధించారు. ఎస్.ప్రణయ్, పి.కీర్తి, ఎన్.యశ్వంత్ రెడ్డిలు స్వర్ణ పతకాలు సాధిం చగా.. పి.వెంకట తేజోదయ రజిత పతకం, పి.తనూష, కే.సాత్విక్‌లు కాంస్య పతకాలు సాధించారు. విద్యార్థులను పాఠశాల సీఈవో గోపినాథ్, సౌమ్యగోపినాథ్, డీన్ రాజేంద్రన్, ప్రిన్సిపాల్ రాజ్‌కమల్ అభినందించారు.

విజేతలకు బహుమతి ప్రదానం

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19: టాటా కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో స్థానిక కేవీఆర్ గార్డెన్‌లోని కేవీఆర్ ఇంగ్లీషు మీడియం పాఠశాల విద్యార్థులు పాల్గొని గోల్డుమెడల్, సిల్వర్, బ్రౌంజ్ మెడల్స్ పతకాలు సాధించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాధూ శ్రీనివాసరెడ్డి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్ర మంలో వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్, కోఆర్డినేటర్ జయ, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు జట్ల ఎంపిక

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 19: ఈ నెల 20, 21 తేదీల్లో కడప జిల్లా వేంపల్లిలో జరిగే 38వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల హ్యాండ్‌బాల్ జట్లను జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధి చిన్న సుంకన్న ప్రకటించారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ అవుట్‌డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో జిల్లా క్రీడాభివృద్ధి అధికారి భూపతిరావు, స్పోర్ట్స్ ప్రమోటర్, న్యాయవాది శ్రీధర్ రెడ్డి, బాలికల జట్టు మేనేజర్ మంజుల, బాలుర జట్టు మేనేజర్ శేఖర్, వెంకటేశ్, ఇరుజట్ల ఇన్‌చార్జి బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ఓర్వకల్లు, సెప్టెంబరు 19: ఓర్వకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎం ఈవో-2 ఓంకార్ యాదవ్ ప్రారంభించారు. అండర్-14, 17 విభాగం బాలుర, బాలికలకు పలు క్రీడల్లో ఈ నెల 21న అథ్లెటిక్స్ పోటీలు ఉంటా యన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ పోటీలకు విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కర్నూలు(స్పోర్ట్స్), సెప్టెంబరు 19: ఏపీ రాష్ట్ర హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సబ్ జూనియర్, రాష్ట్ర స్థాయి పోటీలకు కర్నూలు మున్సిపాల్ హైస్కూల్ మెయిన్ విద్యార్థి భాస్కర్ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ దాసరి తెలిపారు. ఈ నెల 21వ తేదీ నుంచి 23 వరకు కడప జిల్లా వేంపల్లిలో జరిగే సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు రోజా, శివలీల, రామశాస్త్రి, భాస్కర్, సురేష్‌లు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, సెప్టెంబరు 19: విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా బి.క్యాంప్ సెక్షన్ పరిధిలో విద్యుత్ కోత ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ టి.శేషాద్రి గురువానం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ కోత ఉంటుందని ఏడీఈ రాజేంద్రబాబు తెలిపారు. గణేష్‌నగర్, రాచంద్ర మిషన్, రెవెన్యూ కాలనీ, సోమిశెట్టినగర్, మదర్‌ల్యాండ్, సాయివైభవ్ నగర్, జంపాల అపార్ట్‌మెంట్, ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, ప్రజలు సహకరిం చాలని కోరారు.

రిపోర్టులు త్వరగా ఇవ్వాలి

జీజీహెచ్ సూపరింటెండెంట్ సి.ప్రభాకర్‌రెడ్డి



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 19: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు న్యూడయోగ్నస్టిక్ బ్లాకులో పరీక్షల రిపోర్టులు అదే రోజు ఇవ్వాలని సిబ్బందిని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.సి. ప్రభాకర్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన డా. బీవీ రావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.హేమనళినితో కలిసి ఆసుపత్రిలో రౌండ్స్ నిర్వహించారు. ముందు ఆయన న్యూడయోగ్నస్టిక్ బ్లాకులో బయోకెమిస్ట్రీ విభాగంలో ఉన్న వైద్య పరికరాలను పరిశీలించి వాటి పని తీరు గురించి ఆరా తీశారు. లోకల్ పర్చేజ్‌లో వాటికి సంబంధించిన స్టాక్ వివరాలను పరిశీలించి అవసరమైన వాటికి ఏడాదికి ఇండెంట్ పెట్టుకోవాలన్నారు. ఆసుపత్రిలో డ్రైనేజీ మరమ్మతులను త్వరగా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఆర్ఎంవో వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల, కిరణ్‌కుమార్, ఆసుపత్రి ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రిబాయి పాల్గొన్నారు.

సర్పంచ్ ఉదారత



వాటర్ ప్లాంట్‌కు నిర్మించిన గదిని ప్రారంభిస్తున్న సర్పంచ్

కోడుమూరు(రూరల్), సెప్టెంబరు 19: మండలంలోని అమడగుంట్ల సర్పంచ్, టీడీపీ నాయకురాలు వరలక్ష్మి గ్రామంలోని ఉన్నత పాఠశాలకు సుమారు రూ. 3.5 లక్షల సొంత డబ్బుతో గదిని నిర్మించారు. పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌కు గదిని నిర్మించడానికి విరాళం ఇచ్చారు. ఆర్వో ప్లాంట్‌కు గదిని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వరలక్ష్మి మాట్లాడుతూ తన భర్త రఘునాథరెడ్డి జ్ఞాపకార్థం ఆర్వో ప్లాంట్‌కు గది, రూ. 1.8 లక్షలతో రేకుల షెడ్‌ను నిర్మించడానికి విరాళాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం అనంతయ్యయాదవ్, టీడీపీ నాయకులు శంకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, రవికిషోర్ పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 15 కేసులు నమోదు

కర్నూలు, సెప్టెంబరు 19: నగరంలో ట్రాఫిక్ పోలీసులు గురువారం రాత్రి 15 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. స్థానిక సుంకేసుల రోడ్డులోని సంజీవని హాస్పిటల్ వద్ద ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 12 ద్విచక్రవాహనదారులు, 2 ఆటో డ్రైవర్లు, ఒక లారీపై కేసులు నమోదు చేశారు.

ఘనంగా బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు



వీకర్ సెక్షన్ కాలనీలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 19: నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలోని వై జంక్షన్‌లో మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి జన్మదిన వేడుకలు టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మల్లెల పుల్లారెడ్డి, తెలుగు యువత నాయకుడు, టెలీ కమ్యూనికేషన్స్ సంస్థ సలహా కమిటీ సభ్యుడు మధు, నాయకులు బాషా, శ్రీనివాసులు, మల్లికార్జున రెడ్డి, సత్య శ్రీరామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధు, బాషా, మల్లికార్జున రెడ్డి, సత్య శ్రీరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి జన్మదిన వేడుకలు గురువారం ఓర్వకల్లులో ఘనంగా జరిగాయి. టీడీపీ నాయకులు సూర్యనారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, వందనాలు, అల్లాబాబు, రామకృష్ణ, కాంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి: ఏవో



ఈకేవైసీ చేస్తున్న అధికారులు

గూడూరు, సెప్టెంబరు 19: ఈ - పంట యాప్‌లో సాగు చేసిన పంటల వివరాలు నమోదు చేసుకోవడంతో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎల్ శ్రీవర్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం గూడూరు పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ అధికార యంత్రాంగం రైతుల నుంచి ఈకేవైసీని నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల రైతులు తప్పని సరిగా వారు సాగు చేసిన పంటల వివరాలను ఈ-పంట యాప్‌లో నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన గౌరు చరిత

కల్లూరు, సెప్టెంబరు 19: రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత కలిశారు. గురువారం హోంమంత్రితో మర్యాదపూర్వకంగా కలిసి పాణ్యం నియోజకవర్గంలోని పలు అంశాలను ఎమ్మెల్యే చర్చించారు. శాంతిభద్రతలు, మహిళా రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఆర్.యశ్వంత్‌రెడ్డి ఉన్నారు.

కళాశాలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), సెప్టెంబరు 19: ఎమ్మిగనూరులోని జీఎంఆర్ టీటీసీ కళాశాలకు ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మేనేజ్‌మెంట్ కోటా పేరుతో సీట్లు అమ్ముకుం టున్నారని, ఆ కళాశాల యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులుకు వారు వినతి పత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, రాయలసీమ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నియమ నిబంధనలకు వ్యతిరేకంగా సీట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

మీటర్ రీడర్లకు ఇస్రో అకౌంట్ ఓపెన్ చేయాలి

కల్లూరు, సెప్టెంబరు 19: విద్యుత్‌శాఖలో మీటర్ రీడర్లకు ఇస్రో అకౌంట్ ఓపెన్ చేసి వేతనాలు అందించాలని కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, గౌరవ అధ్యక్షుడు మునెప్ప డిమాండ్ చేశారు. ఏపి విద్యుత్ మీటర్ రీడర్స్ ఏపీఎస్పీడీసీఎల్ కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు విద్యుత్‌శాఖ సర్కిల్ ఎస్ఈ యం. ఉమాపతికి కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని ఎస్ఈ తెలిపినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం ఎస్ఏఓ, విజిలెన్స్ అధికారులకు వినతిపత్రాలు అందజేశామని సంఘం నాయకులు తెలిపారు. సురేష్, నవీన్, చంద్రశేఖర్, రాజు పాల్గొన్నారు.

వీబీఎస్ పీఆర్ఓగా ఎన్. రామానాయుడు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 19: ఏపీ వాల్మీకి బోయ సంఘం జిల్లా పీఆర్ఓగా నల్లబోతుల బోయ రామానాయుడును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు విక్రమ్‌నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాల్మీకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రామా నాయుడు తెలిపారు. పీఆర్ఓగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ క్రాంతినాయుడకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్యాభివృద్ధే స్వచ్ఛతా హి సేవ లక్ష్యం

ఓర్వకల్లు, సెప్టెంబరు 19: ఆరోగ్యాభివృద్ధే స్వచ్ఛతా హి సేవా లక్ష్యమని ఈవోఆర్‌డీ సుబ్బరాయుడు అన్నారు. మూడో రోజు గురువారం ఓర్వక ల్లులోని స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. సచివాలయం, జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అదేవిధంగా మండలంలోని నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, హుశేనా పురం గ్రామాల్లో కూడా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు.



ఓర్వకల్లులో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈవోఆర్‌డీ

పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు

కోడుమూరు: స్థానిక మేజర్ గ్రామపంచాయతీలో పారిశుధ్య కార్మికులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సఫాయి మిత్ర సురక్ష కింద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది వైద్య పరీక్షలు చేపట్టారు. కార్మికులకు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వైద్య పరీక్షలు చేపట్టి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అజయ్‌భాస్కర్, వైద్య బృందం నరసప్ప, కమాల్ సాహెబ్, ఉమాబాయి తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు(రూరల్): పరిసరాలు శుభ్రంగా ఉన్నపుడే ఆరోగ్యం ఉంటుందని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. గురువారం కల్లపరి, పులకుర్తి గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటితో పాటు వీధులు శుభ్రంగా ఉంచుకోవడం ముఖ్యమని, ద్వారా ఈగలు, దోమలు వృద్ధి చెందవని తెలిపారు.



కోడుమూరులో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

పంటలను నాశనం చేస్తున్నారు

వజ్రాన్వేషకులపై రైతులు, స్థానికుల గగ్గోలు

తుగ్గలి, సెప్టెంబరు 19: వజ్రాల అన్వేషకులతో పొలాల్లో సాగుచేసిన పంటలు పాడవుతున్నాయని, కాపాడాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని జొన్నగిరిలో స్థానిక వజ్రాల వ్యాపారి ఇతర ప్రాంతాల వారిని పిలిపించి స్థావరాలు ఏర్పాటు చేస్తున్నారనీ, మరికొందరు ఆలయాలు, పాఠశాల ఆవరణ, బస్టాండు వద్ద ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని అన్నారు. వజ్రాన్వేషకులతో జొన్నగిరి ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసు కుంటు న్నట్లు ఆరోపిస్తున్నారు.

పోలీసులు వజ్రాన్వేషకులను హెచ్చరిస్తున్నా..

పొలాల్లో తిరగకూడదని పోలీసులు హెచ్చరిస్తున్నా, హెచ్చరిక బోర్డులు పెట్టినా పట్టించుకోవడం లేదని రైతులు అంటున్నారు. తమ పొలాల్లోకి రావద్దని రైతులు వారిస్తే దాడులకు పాల్పడిన ఘటనలు ఉన్నాయన్నారు. మహిళలు పనులకు వెళ్లలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పొలంలో వజ్రాలను అన్వేషిస్తున్న ప్రజలు



గ్రామంలో హెచ్చరిక బోర్డులు

పంచాయతీకి పన్నులు చెల్లించేలా చూడాలి

పొలాల్లో లభించిన వజ్రాల కొనుగోలుపై వ్యాపారులు పంచాయతీకి పన్నులు చెల్లించేలా అధికారులు చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. వజ్రాల వ్యాపారి, అన్వేషకులపై చర్యలు తీసుకోకుంటే కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి



వజ్రాల వేటకు వచ్చి పంట పొలాలను నాశనం చేస్తున్న అన్వేషకులపై చర్యలు తీసుకోవాలి. జొన్నగిరిలో దొరుకుతున్న వజ్రాలపై వ్యాపారుల నుంచి పంచాయతీ అధికారులు పన్నులు పన్నులు వసూలు చేయాలి- **ఓబులేసు సర్పంచ్, జొన్నగిరి**

రాహుల్ గాంధీపై విమర్శలు సరికాదు

ఆదోని టౌన్, సెప్టెంబరు 19: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీని బీజేపీ ఎమ్మెల్యేలు, మంత్రులు విమర్శించడం సరికాదని ఆ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు ఎండీ నూర్ అహ్మద్ అన్నారు. గురువారం మాట్లాడుతూ, తీవ్రవాదుల చేతులలో మరణించిన ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ కుటుంబానికి చెందిన రాహుల్‌ను తీవ్రవాదిగా ముద్ర వేయడంపై మోదీ, అమిత్ షాగా నోరు మెదపలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

టీకాలు వేయించాలి

మద్దికెర, సెప్టెంబరు 19: రైతులు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యా ధికారి కృష్ణ నాయక్ తెలిపారు. గురువారం రైతులతో సమావేశమయ్యారు. జీవాలు ప్లురోగం బారిన పడకుండా పీపీఆర్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు.

తప్పులు సరి చేయాలి

మద్దికెర, సెప్టెంబరు 19: సదరం క్యాంపులో ఇచ్చిన ధ్రువపత్రాల్లో తప్పులున్నాయని వాటిని సరిచేయాలని దివ్యాంగులు ఆంజనేయులు, భాస్కర్ కోరారు. గురువారం ఎంపీడీవో సువర్ణలత దృష్టికి తీసుకెళ్లారు. పేర్లలో తప్పులు వచ్చాయని, సరిచేయాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు.

నేడు మండల స్థాయి ఆటల పోటీలు

దేవనకొండ, సెప్టెంబరు 19: విద్యార్థులకు పి.కోటకొండలో మండలస్థాయి ఆటలపోటీలు నిర్వహించనున్నట్లు కో ఆర్డినేటర్ మద్దిలేటి గురువారం తెలిపారు. కబడ్డీ, క్రికెట్, ఖోఖో,చెస్, యోగా, బ్యాడ్మింటన్‌ను ఎస్ఎస్‌జీఎస్ అధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. ప్రతిభ కనపరచినవారిని తాలుకా, జిల్లాస్థాయికి పంపుతామన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

పత్తికొండ, సెప్టెంబరు 19: పొదుపు మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్బీఐ ఆర్ఎం అమర్నాథ్ సూచించారు. గురువారం బ్యాంకులో వెలుగు అధికారులు, సభ్యులతో మాట్లాడారు.

క్రీడా పరికరాల అందజేత

దేవనకొండ,సెప్టెంబరు 19: తెర్నేకల్ జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థులు హాకీ క్రీడా పరికాలను గురువారం అందజేశారు. రూ.22 వేలు విలువ చేసే పరికరాలను ఇవ్వడంతో హెచ్ఎం కృష్ణమూర్తి, సర్పంచ్ అరుణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. పూర్వ విద్యార్థులు పెద్దయ్య, ప్రభాకర్, విజయానంద తదితరులు పాల్గొన్నారు.

కడివెళ్లలో తాగునీటి బోరు



బోరు వేయిస్తున్న టీడీపీ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 19: మండలంలోని కడివెళ్ల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోరును గురువారం వేశారు. బోరు వేయిస్తానని గతంలో బీవీ హామీ ఇచ్చారని అధికారంలోకి వచ్చి వెంటనే ఎమ్మెల్యే బోరు వేయించినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. గొల్ల హనుమంతు, రంగనాయకులు, పల్లెపాటి హనుమంతు, గుంటెప్ప, శ్రీనివాసులు, రాముడు, రాజశేఖర్, గోపాల్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

తుగ్గలి, సెప్టెంబరు 19: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పీఈటీల సంఘం జిల్లా కార్యదర్శి చందూ నాయక్, కోఆర్డినేటర్ పాండురంగరాజు అన్నారు. గురువారం పెండేకల్లు ఆర్ఎస్ జడ్పీహెచ్ఎస్ మైదానంలో మండలస్థాయి క్రీడలను ఎంఈవో రమావెంకటేశ్వ్ ప్రారంభించారు. ఖో-ఖో, కబడ్డీ, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. పీఈటీలు వేణుగోపాల్, రంగస్వామి, సలోమి, తదితరులు ఉన్నారు.

డీఎస్పీగా ఉపేంద్రబాబు బాధ్యతలు



ఉపేంద్రబాబు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 19: ఎమ్మిగనూరు నూతన డీఎస్పీగా ఉపేంద్రబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ సీతారామయ్య గుంటూరు ఎస్బీ డీఎస్పీగా బదిలీ కాగా, అనకాపల్లి దిశా డీఎస్పీగా పనిచేస్తున్న ఉపేంద్రబాబును ప్రభుత్వం ఎమ్మిగనూరుకు బదిలీ చేసింది. శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. మహిళలకు భద్రత కల్పిస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు, సైబర్‌క్రైమ్‌పై నిఘా ఉంచుతామన్నారు. డీఎస్పీని సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

కార్యకర్తలకు జనసేన అండ

ఆదోని రూరల్, సెప్టెంబరు 19: కార్యకర్తలకు జనసేన అండగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు తాహేర్ వలి, రేణు వర్మ పేర్కొన్నారు. గురువారం ఆదోనిలో మాట్లాడుతూ నెట్టేకల్లు గ్రామానికి చెందిన సత్య నారాయణ కార్పెంటర్ పని చేస్తూ తీవ్రంగా పడ్డారని అన్నారు. పార్టీ అధినాయకత్వానికి తెలపడంతో రూ.25,048 పంపినట్లు, బాధితుడికి అందజేసినట్లు తెలిపారు. పులిరాజా, లోకేష్, చిరుత రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో ప్రతిభ

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 19: జోనల్ స్థాయి డ్రాయింగ్ పోటీల్ల జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి నఫీజ్ అహ్మద్ ప్రతిభ చూపి, ప్రథమ స్థానంలో నిలిచాడు. గురువారం హెచ్ఎం ఇందిరాదేవి విద్యార్థిని అభినందించి సర్టిఫికెట్‌ను అందజేశారు విద్యాకమిటీ ఛైర్మన్ రమేష్, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు వెంకటేష్, పీడీ రామన్న, ఫిజికల్ డైరెక్టర్ రామన్న, ఉపాధాయులు రామకృష్ణ, రామమూర్తి, యశోద, శివగౌడ్, గణేష్, మంజుల, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఆదోనిలో అన్న క్యాంటీన్లు ప్రారంభం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 19: పట్టణంలో మూడు అన్న క్యాంటీన్లు గురువారం ప్రారంభమయ్యాయి. టీడీపీ నాయకుడు ఉమాపతి నాయుడు గురువారం క్యాంటీన్‌ను ప్రారంభించారు. నిర్మల్ థియేటర్, అంబేడ్కర్ విగ్రహం దగ్గర, పోస్టాఫీస్ వద్ద మూడు అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. రూ.5కే అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇన్‌చార్జి కమిషనర్ అనుపమ, కౌన్సిలర్ పార్వతి, టీడీపీ నేతలు బత్తిన కుబేర్‌నాథ్, మారుతి నాయుడు, వెంకటేష్ చౌదరి, శ్రీకాంత్ రెడ్డి, ఉమ్మీ సలీం, రామస్వామి, బాబునాయుడు, శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.

విద్యార్థినికి పాము కాటు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 19: మండలంలోని దూదేకొండ ప్రభుత్వ పాఠశాల ఒకటో తరగతి ఓ విద్యార్థిని సౌమ్య గురువారం పాము కాటుకు గురైంది. వివరాల మేరకు.. తలారి కృష్ణ కూతురు సౌమ్యను గురువారం పాఠశాల ఆవరణలో పాము కాటువేసింది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. వైద్యులు పరీక్షించి, చికిత్స చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు నజీర్, ఆల్తాఫ్ విద్యార్థిని పరామర్శించారు. పాఠశాల పరిసరాలను శుభ్రపరచాలని కోరారు.

రైతు బిడ్డకు ఎంబీబీఎస్ సీటు



మధుమిత(ఫైల్)

మద్దికెర, సెప్టెంబరు 19: మండలంలోని పెరవలి గ్రామానికి చెందిన మల్లికార్జున, ఉమాదేవి కుమార్తె కారుమంచి మధుమిత తిరుపతి పద్మావతి మహిళా మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. రైతు కుటుంబంలో జన్మించిన మధుమిత పదో తరగతి పెరవలి జడ్పీహెచ్ పాఠశాలలో, ఇంటర్మీడియట్ శ్రీచైతన్య కాలేజీలో చదివింది. కోచింగ్ లేకుండానే 720 మార్కులకు గాను 587 మార్కులు, రాష్ట్ర స్థాయి ర్యాంకులో 2844 ర్యాంకు సాదించింది. మధుమితను జడ్పీటీసీ డి.మురళీధర్ రెడ్డి, ఎంఈవో రంగస్వామి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఉపసర్పంచ్ ఆముదాల గోపాల్, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు దస్తగిరిగౌడ్ అభినందించారు.

వేగంగా దర్యాప్తు చేయండి

- ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తుపై సబ్ కలెక్టర్ ఆదేశం



వినతిపత్రం స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్

ఆదోని, సెప్టెంబరు 19: ఎస్సీ, ఎస్టీ కేసులను వేగంగా దర్యాప్తు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. గురువారం కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను అధికారులతో ఆరా తీశారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ద్వారా బాధితు లకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల నమోదులో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డీఎస్పీని ఆదేశించారు. ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు రవికుమార్ ప్రతినెల చివరి తేదీన గ్రామాల్లో పౌర హక్కుల దినం నిర్వహించేలా చూడాలని వినతిపత్రం అందజేశారు డీఎస్పీ సోమ న్న, డీఎల్‌డీవో నాగేశ్వరరావు, ఏవో వీరభద్రప్ప, తహసీల్దారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని మార్చాలి

శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ కళాశాల బాలుర ఎస్సీ వసతి గృహాన్ని మార్చాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. శశి దర్, దేవరాజ్, గణేష్, ప్రతాప్, రాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజలు కోరుకున్న పాలన

- టీడీపీ నాయకుడు వీరభద్ర గౌడ్



ఆలూరు, సెప్టెంబరు 19: రాష్ట్రంలో ప్రజలు కోరుకున్న పాలన కొనసాగుతుందని టీడీపీ నాయకుడు వీరభద్ర గౌడ్ అన్నారు. గురువారం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులైందన్నారు. పాలనలో సాధించిన విజయాలు, తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తామని అన్నారు. వైసీపీ తప్పుడు ప్రచారా లను తిప్పి కొట్టాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. టీడీపీ, బీజేపీ జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శుక్రవారం నుంచి వారం పాటు గ్రామాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకుంటామన్నారు. మొదటి రోజు హాలహర్వి మండలం, 21న శనివారం మొలగవల్లి, 22న పెద్ద హోతూరు 23న హాలిగేర, 24న హొళగుంద టౌన్, 25న దేవనకొండ, 26న రామదుర్గం గ్రామాల్లో పర్యటిస్తామన్నారు.

మంత్రాలయం: వంద రోజుల పాలన సంబరాలకు సిద్ధం కావాలని టీడీపీ నాయకులడు రాఘవేంద్రరెడ్డి కార్యకర్తలకు సూచించారు. 20న చెట్నహళ్లి, 21న కౌతాళం మండలం సులేకేరీ, 22న పెద్దకడుబూరు మండలం కంబలదిన్నె, 23న కోసిగి మండలం దుద్ది, 24న మంత్రాలయం మండలం చిలకల డోన, 25న పెద్దకడుబూరు లో, 26న కోసిగి టౌన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రఘునాథ రెడ్డి, రామకృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని బట్టి ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న కళాశాల సీఈవో తిరుమలరెడ్డి

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 19: నైపుణ్యాన్ని బట్టి ఎల్ఐసీలో ఉద్యోగాలు లభిస్తాయని ఏబీఎం సంతోష్‌కుమార్ తెలిపారు. గురువారం రావూస్ డిగ్రీ కళాశాలలో సీఈవో తిరుమలరెడ్డి అధ్యక్షతన అవగాహన కల్పించారు. ఎల్ఐ సీలో ఏజెంట్‌గా ఉద్యోగిగా, ఏవో, డీవో, ఏబీఎం, బీఎం వరకు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని తెలిపారు. ఎల్ఐసీ 1956లో ఆవిర్భవిం చిందన్నారు. దేశంలో బీమా కంపెనీలు 24 ఉండగా ప్రభుత్వ సంస్థ ఎల్ఐసీ మాత్రమేనన్నారు. డీవో రామకృష్ణ, పరమేశ్వరరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ఇర్ఫాన్, హెచ్‌డీవోలు విజయ్ కుమార్, వీరేష్, వెంకటేశ్వర్లు, నందిని, పాల్‌రాజు పాల్గొన్నారు.

బాధితురాలిని పరామర్శించిన సబ్ కలెక్టర్



బాధితురాలిని పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 19: ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దళిత గోవిందమ్మను సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ గురువారం పరామర్శించారు. పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో వారం క్రితం బాధితురాలిపై దాడిచేయడంతో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. సబ్ కలెక్టర్ బాధితురాలి భౌతిక, మానసిక స్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ మౌర్య భరద్వాజ్ మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం తరపున పరిహారం త్వరగా అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని, దాడిచేసినవారిని విచారించాలని పోలీసులను ఆదేశించారు.

ఫిర్యాదుపై విచారణ

పత్తికొండ, సెప్టెంబరు 19: శ్రీనిధి రుణాల్లో అవకతవకలు జరిగాయంటూ గ్రూప్‌సభ్యురాలు పీడీకి ఫిర్యాదు చేయడంతో గురువారం విచారణ నిర్వహించారు. కర్నూలు నుంచి వచ్చిన ఏపీఎం సాగర్ గ్రూపుసభ్యులతో విచారణ నిర్వహించారు. గ్రూపుసభ్యులు రుణం మొత్తాన్ని సంస్థకు పూర్తిగా చెల్లించారని అయితే ఓ మహిళకు ఇచ్చారని వడ్డీ విషయంలో వివాదం చోటు చేసుకుని పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారని దీంతో సంస్థకు సంబంధంలేదన్నారు. వివరాలను పీడీకి అందిస్తామని తెలిపారు. కాగా పత్తికొండ మండలంలో 38 గ్రామైక్య సంఘాలకు రుణాలను ఇవ్వగా, 98 శాతం తిరిగి చెల్లించారని తెలిపారు.

శ్రీనిధి వీవోఏలకు వార్నింగ్

గ్రూపుల నుంచి మామూళ్లు వసూలు చేస్తున్నట్లువీవోఏలపై ఫిర్యాదులు వస్తున్నాయని పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని ఏపీఎం సాగర్ హెచ్చరించారు. వాయిదాలు ఆన్‌లైన్ లో చేయాలని నగదు ద్వారా చేయొద్దన్నారు.

ఎస్ఐకి సన్మానం

నందవరం సెప్టెంబరు 19: ఎస్ శ్రీనివాసులును టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ దేశాయి మాధవరావు, కర్నూలు యార్డు మాజీ డైరెక్టర్ సోమలగూడురు వెంకట్రామిరెడ్డి సన్మానించారు. కలిసిమెలిసి ఉండాలని ఎస్ఐ సూచించారు. మాజీ సర్పంచ్ రాముడు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.25 వేల విరాళం



రమాకాంత్ రెడ్డికి విరాళం ఇస్తున్న కరస్పాండెంట్

పెద్దకడుబూరు, సెప్టెంబరు 19: మండల కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాల యాజమాన్యం వరద బాధితుల సహాయార్థం తెలుగు రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డికి గురువారం అందజేశారు. కరస్పాండెంట్ గోవింద్ రెడ్డి, ఉపాధ్యాయులు ప్రసాద్, పుల్లయ్య, శ్యాముల్ రూ.25వేలు, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ తరుపున మరో రూ.10 వేలు, గుమ్మల రాజేష్ రూ 5వేలు నగదు మొత్తం రూ.40వేలు అందజేశారు. వారిని రమాకాంత్‌రెడ్డి అభినందించారు.

రూ.32,000 విరాళం

ఎమ్మిగనూరు టౌన్: వరద బాధితులకు గుడ్‌బేస్ పాఠశాల విద్యార్థులు రూ.32,000 విరాళం ఇచ్చారు. బియ్యం, దుస్తులు, నగదు సేకరించి గొప్ప మనసును చాటుకున్నారు. ఈ విరాళాలను సామాజిక కార్యకర్త మల్లెల అల్‌ఫ్రెడ్ రాజుకు అందజేశారు. డైరెక్టర్ కల్యాణ్ చక్రవర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

శిశువు ఎదుగుదలకు పౌష్టికాహారం కీలకం

- పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు



పౌష్టికాహార స్టాళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పత్తికొండ, సెప్టెంబరు 19: తల్లిగర్భంలో శిశువు ఎదుగుదలకు పౌష్టికాహారం కీలకమని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. పత్తికొండ ఐసీడీఎస్ పరిధిలో సీడీపీవో లలిత ఆధ్వర్యంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు అన్నిరకాల సేవలందిస్తోందని, అన్నారు. అంగన్‌వాడీలు ఇంటింటికి తిరిగి వారి వివరాలను సేకరించి, పౌష్టికాహారం అందిస్తున్నారని, బాల్య వివాహాలను అరికట్టడంలో కీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. గతప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల నిరసనకు టీడీపీ మద్దతుగా నిలిచిందని గుర్తుచేశారు. అనంతరం పౌష్టికాహారం స్టాల్స్‌ను పరిశీలించారు. ఆర్డీవో రామలక్ష్మి, సీఐ జయన్న, టీడీపీ నాయకులు సాంబశివారెడ్డి, రామానాయుడు, లోక్‌నాథ్, వెంకటపతి, బీటీగోవిందు, గోపాలయ్య, శ్రీనివాసులుగౌడ్ ఉన్నారు.

ఎల్లార్తిలో ఎమ్మెల్యే శ్యాంబాబు

హొళగుంద: ఎల్లార్తి షేక్షావలి, షాషావలి సాహెబ్ దర్గాను పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు గురువారం దర్శించుకున్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా ఉరుసుఃః పోస్టర్లను విడుదల చేశారు. టీడీపీ నాయకులు బత్తిన లోక్‌నాథ్, రామానాయుడు, శ్రీధర్ రెడ్డి, రఘు చౌదరి, రమేష్, వసీం, చిదానంద, సర్దార్, దర్గన్న పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థినులకు తీవ్ర అస్వస్థత

- ఒకరు కర్నూలు పెద్దాసుపత్రికి తరలింపు



చికిత్స పొందుతున్న విద్యార్థిని

ఆదోని(అగ్రికల్చర్), సెప్టెంబరు 19: బీసీ కళాశాల బాలికల వసతిగృహానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హాస్టల్ వార్డెన్ పరిమళమ్మ తెలిపిన వివరాల మేరకు.. సీనియర్ ఇంటర్మీడియట్ చదువుతున్న ఇందు, భాగ్యమ్మ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు వెళ్లారు. అక్కడ ప్రార్థన సమయంలో స్పృహ తప్పి కింద పడిపోయారు. అధ్యాపకులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలింయగా పరీక్షించిన వైద్యులు పరీక్షించి ఇందు అనే విద్యార్థినికి బీపీ తీవ్రంగా ఉన్నట్లు గుర్తించి, కర్నూలు పెద్దాసుపత్రికి రెఫర్ చేశారు.. మరో అమ్మాయికి ఫిట్స్ రావడంతో చికిత్స అందిస్తున్నారు. ప్రిన్సిపాల్ సంజన్న ఆసుపత్రికి చేరుకొని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తల్లిదండ్రులకు సమాచారమిచ్చామని భయపడాల్సిన అవసరం లేదని, చికిత్స చేయిస్తామని వారు తెలిపారు.

వెండి రథోత్సవం



రజత రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, సెప్టెంబరు 19: మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. జీవ సమాధి పొందిన గురువారం శభదినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజత రథాన్ని పుష్పాలతో అలంకరించి ఊరేగించి, ఊంజలసేవ నిర్వహించారు.

మంత్రాలయంలో భక్తుల సందడి

రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మఠం సందడిగా మారింది. దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు.

పీఠాధిపతి గదికి టేకుతో ఆధునికీకరణ

పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మంత్రాక్షితలు ఇచ్చే గదికి రూ2 కోట్లతో టేకు చెక్కతో ఆధునీకరణ పనులకు శ్రీకారం చుట్టారు. కర్ణాటక మాజీ మంత్రి అరవింద లింబావలి, రాఘవేంద్రశెట్టి పనులు చేయిస్తున్నారు. .

వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 19: మార్కెట్ యార్డులో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న డిమాండ్ చేశారు. గురువారం కార్యాలయంలో మాట్లాడుతూ రైతులు అహర్నిశలూ కష్టపడి పండించిన ఉత్పత్తులను మార్కెట్ యార్డుకు తెస్తే కమిషన్ ఏజెంట్లు రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. రూ.100లకు రూ.2ల కమిషన్ తీసుకోవాల్సి ఉండగా రూ.4లు తీసుకుంటున్నారని దళారులు దుకాణాలకు సరుకును తెస్తే బస్తాకు రూ.10ల నుంచి రూ.20లు ఇస్తామని ఆటో డ్రైవర్లకు ఎరచూపారని అన్నారు. సమీఉల్లా, ఖాజా, మల్లికార్జునగౌడ్, సుంకన్న, నరసింహులు, రామాంజనేయులు పాల్గొన్నారు.

సారా వ్యాపారి అరెస్టు

ఆదోని రూరల్, సెప్టెంబరు 19: పట్టణానికి చెందిన సారా వ్యాపారి బోయశివను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్.ఐ నాగేంద్ర గురువారం తెలిపారు. వివరాల మేరకు.. నిందితుడు ఇస్వీ కొండల్లో నుంచి తరలిస్తుండగా 40లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నేటి నుంచి గ్రామ సభలు

మద్దికెర, సెప్టెంబరు 19: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనపై నేటి నుంచి గ్రమ సబబు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సువర్ణలత తెలిపారు. 20న బసినేపల్లి, 22న బురుజుల, 24న హంప, 25, 26 తేదీల్లో ఎం.అగ్రహారం, మద్దికెర, పెరవలి గ్రామాల్లో ఉంటాయన్నారు. అధికారులు, సర్పంచులు సచివాలయ ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వేతనాలు విడుదల చేయాలి

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 19: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న నైట్ వాచ్‌మెన్‌ల వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తాలుకా, మండల అధ్యక్షులు రాముడు, గోవిందు మాట్లాడుతూ ఏడు నెలలుగా వేతనాలు లేవని, వారి కుటుంబాలు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. డీఈవో స్పందించాలన్నారు. నారాయణ, వలి, నాగరాజు పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 19: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత గోవిందమ్మపై దాడి సంఘటనపై ఢిల్లీలోని జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు బీఎస్ఎస్‌చీఫ్, హైకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్ గురువారం తెలిపారు. ఛైర్‌పర్సన్ విజయభారతిసాయిని కలిసి పూర్తివివరాలతో కూడిన ఫిర్యాదును అందజేశామని అన్నారు. స్పందించిన ఆమె వివరాలు సమర్పించాలని పోలీసులు, ఉన్నతాధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సునీల్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షులు రామతీర్థం అమరేష్ పాల్గొన్నారు.

అల్లూరి పేరు పెట్టడం హర్షణీయం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 19: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడంపై ఎరుకల సేవా సంఘం ప్రధాన కార్యదర్శి శివ సూర్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. తెలిపారు. ఇది గిరిజనులకు దక్కిన గౌరవమన్నారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈశ్వర్, సుంకన్న, ప్రకాష్ పాల్గొన్నారు.

వ్యక్తి గల్లంతు

హలహర్వి, సెప్టెంబరు 19: ఎల్లెల్సీలో నీరు తాగేందుకు వెళ్లి సోమశేఖర్ (38)అనే వ్యక్తి గురువారం గల్లంతయ్యాడు. బాపురం వద్ద దాహం కోసం పొలంలో పనిచేసుకుంటే దాహం కావడంతో బపురం వద్ద ఎల్లెల్సీ వద్దకు పోయి ప్రమాదవశాత్తు కాల్వలో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఆయనకు భార్య, కూతురు ఉన్నారు. బంధువులు ఎంత ప్రయత్నంచినా ఆచూకీ లభించలేదు.

రైతుల సహకారంతోనే అభివృద్ధి

తుగ్గలి, సెప్టెంబరు 19: రైతులు సహకరిస్తేనే సొసైటీ అభివృద్ధి చెందుతుందని మారెళ్ల సొసైటీ సీఈవో మనోహర్ నాయుడు అన్నారు. గురువారం పెండేకల్ ఆర్ఎస్ సొసైటీ కార్యాలయంలో మాట్లాడుతూ సొసైటీల రికార్డులు ఆన్‌లైన్ అవుతున్నాయని అన్నారు. రైతులు రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు.

బాలికా సంరక్షణపై అవగాహన

ఆదోని (అగ్రికల్చర్), సెప్టెంబరు 19: ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో బాలిరల ఆరోగ్య సంరక్షణపై గురువారం అవగాహన కల్పించారు. ఆరోహిత్ వెల్‌నెస్ ఫ్యామిలీ సంస్థ ఎండీ ఈరన్న యాదవ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ శానిటరీ ప్యాడ్స్‌తో బాలికలకు థైరాయిడ్ పీసీఓడీ గర్భాశయ క్యాన్సర్ వంటి ఆరోగ్య సమస్యలు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్ ఉపయోగిస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తవని సూచించారు. వ్యక్తిత్వ వికాసపై నిపుణురాలు సంధ్యారాణి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ప్రభావతి, రాఘవ ప్రసాద్, కళాశాల అధ్యాపకులు నలిని, ఇందిరాదేవి, ఎన్ఎస్ఎస్ అధికార్లు జోనాథన్ వీక్లీ, ఉమాదేవి, ఎన్‌సీసీ అధికారి వీరమ్మ పాల్గొన్నారు.